ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
04-01-2025
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 114 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 సంవత్సరం నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్ ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని అన్నారు.

## రాబోయే 25 ఏండ్ల
# ఫ్యూచర్ ప్లాన్

- హైదరాబాద్ లో మంచినీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళిక
- జలమండలి అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, జనవరి 3:**

రాబోయే 25 ఏండ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, గ్రేటర్ హైదరాబాద్ సిటీలో మంచినీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జల మండలి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 సంవత్సరం నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్ ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని అన్నారు. ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో శుక్రవారం హైదరాబాద్ జల మండలి బోర్డు సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోర్డు సమావేశమవటం ఇదే తొలిసారి. బోర్డు ఛైర్మన్ హోదాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, హెచ్ఎండబ్ల్యుఎస్ ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సిటీలో ఉన్న జనాభాకు సరిపడే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9800 కిలో

...మిగతాది 2 లో

## మహారాష్ట్రలో రసవత్తరంగా
# రాజకీయాలు
### ఏక్ నాథ్ షిండేకు షాక్ ఇచ్చిన ఫడణవీస్



**మహారాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఒకవైపు, మాజీ బాస్ శరద్ పవార్ తో అజిత్ పవార్ మళ్లీ చేతులు కలపబోతున్నారన్న వార్తలు వస్తుండగా, మరోవైపు, ఫడణవీస్, షిండేల మధ్య విబేధాలు ప్రారంభమైనట్లుగా కథనాలు వస్తున్నాయి.**

**జయభేరి, మహారాష్ట్ర :**

మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షంగా ఉన్న శివసేన (షిండే) వర్గం నేత, మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండ్ కు బీజేపీ నేత, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ షాక్ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏక్ నాథ్ షిండే తీసుకున్న నిర్ణయంపై విచారణకు ఆదేశించారు. మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కోసం బస్సులను అద్దెకు తీసుకోవాలని గత ఏడాది సెప్టెంబర్ లో అప్పటి సీఎంగా షిండే తీసుకున్న నిర్ణయంపై ఫడ్నవీస్ సోమవారం స్టే విధించారు. గత మహాయుతి ప్రభుత్వంలో రవాణా శాఖను కూడా షిండే నే నిర్వహించారు. తాజా నిర్ణయంతో బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బాస్ తనేనని తేల్చి చెప్పారు. మహారాష్ట్ర కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా తనదే సంపూర్ణ అధికారమని చాటుకున్నారు. కొత్త మహాయుతి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం ఫడ్నవీస్ ప్రతి శాఖ పనితీరును సమీక్షిస్తున్నారు. తన ప్రభుత్వ మొదటి 100 రోజుల పాలన కోసం వారి ప్రణాళికలపై చర్చిస్తున్నారు. సోమవారం రవాణా శాఖపై ప్రజెంటేషన్ ఇచ్చిన అనంతరం షిండే తీసుకున్న నిర్ణయం పై స్టే విధించారు.

...మిగతాది 2 లో



# రైతులకు క్షమాపణ చెప్పండి

**జయభేరి, హైదరాబాద్, జనవరి 3:**

ఇచ్చిన హామీలు అమలు చేసే సత్తా లేకుంటే రైతన్నలకు క్షమాపణ చెప్పండి. అంతేగానీ ప్రమాణ పత్రాల పేరుతో రైతుల పై కేసులు పెట్టే ప్రయత్నం మానుకోవాలి. రైతులను భయాందోళనకు గురి చేసే కుట్ర చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. రైతన్నలను దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నం మానుకోవాలి. ప్రజల సొమ్మును రైతన్నలు తింటున్నారన్న దుష్ప్రచారం ఆపాలని' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్ లో కేటీఆర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. రైతు భరోసాను ఎగొట్టే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది. హామీలు నెరవేర్చే సత్తా లేకుంటే రైతన్నలకు క్షమాపణ చెప్పండి.

...మిగతాది 2 లో



## పోర్టులు.. ఎయిర్ పోర్టులతో
# అభివృద్ధికి బాటలు

**ఏడు కొత్త ఎయిర్ పోర్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష**


**గన్నవరం ఎయిర్ పోర్టు విస్తరణ, భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం**

**జయభేరి, అమరావతి, :**

రాష్ట్రంలో కొత్తగా 7 ఎయిర్ పోర్టులు రానున్నాయి. వీటిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ ప్రాజెక్టులను గ్రౌండ్ చేసే పనులు మొదలు పెట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 7 ఎయిర్ పోర్టులు ఉన్నాయి. విశాఖ, తిరుపతి, కడప, రాజమండ్రి, గన్నవరం ఎయిర్ పోర్టులను ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. కర్నూల్ ఎయిర్ పోర్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుండగా.... పుట్టపర్తి ప్రైవేటు ఎయిర్ స్ట్రిప్ గా ఉంది. వీటికి తోడు భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ సిద్ధం అవుతోంది. అయితే పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో కొత్తగా మరో 7 ఎయిర్ పోర్టులను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే కొన్ని ప్రాజెక్టులకు అడుగులు వేయగా...తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టింది. ఈ పరిస్థితుల్లో మళ్లీ వాటిని పట్టాలు ఎక్కించేందుకు, భవిష్యత్ అవసరాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎయిర్ పోర్టుల విస్తరణ, నిర్మాణంతో పాటు, కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సమీక్ష చేశారు. ఈ సమీక్షకు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం కొత్తగా కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జున సాగర్, తునిఅన్నవరం, ఒంగోలులో కొత్తగా ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయనుంది. కుప్పం ఎయిర్ పోర్ట్ కోసం ఫీజిబులిటీ రిపోర్ట్ సిద్ధం చేశారు. రెండు దశల్లో ఈ ఎయిర్ పోర్టు నిర్మాణం జరగనుంది. మొదటి దశలో 683 ఎకరాలు, 2వ దశలో 567 ఎకరాలు కలిపి

...మిగతాది 2 లో

# ఉప్పల్.. ట్రాఫిక్ తిప్పల్...



**జయభేరి, హైదరాబాద్, జనవరి 3:**

ఉప్పల్ పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లైఓవ ర్ బ్రిడ్జి) నిర్మాణ పనులను తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారోనని ప్రజలు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా రు. కారిడార్ నిర్మాణ పనులపై నిర్లక్ష్యం ఎవరిదో ఏ మో కానీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తు న్న ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు ప్రధాన రహదారి విస్తరణతో పాటు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రత్యేక నిధులు కేటాయించింది. ఇట్టి ని ర్మాణ పనులకు

...మిగతాది 2 లో




# నాసా.. ఇస్రో కలిసి ప్రయోగాలు

**జయభేరి, బెంగళూరు, జనవరి 3:**

2025లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరింత దూకుడుగా ప్రయోగాలు చేపట్టబోతోంది. ఇప్పటికే చంద్రయాన్, ఆదిత్య ఎల్ 1 మిషన్‌తో ఇస్రో ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. అగ్రరాజ్యాల సరసన తలెత్తుకుని నిలబడేలా స్థాయికి వెళ్లింది. సొంత ఉపగ్రహాలనే కాదు... విదేశీ శాటిలైట్‌స్‌నూ నింగిలోకి పంపి కమర్షియల్‌గానూ సూపర్ సక్సెస్ అయ్యింది ఇస్రో. అలాగే 2025లో కూడా ప్రపంచం మొత్తం నివ్వెరపోయేలా.. అంతా ఇస్రో వైపు చూసేలా ప్రయోగాలు చేస్తామంటున్నారు శాస్త్రవేత్తలు.
ఈ ఏడాది ఇస్రో నాలుగు PSLV, మరో నాలుగు GSLV, మూడు GSLV

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రాబోయే 25 ఏండ్ల ఫ్యూచర్ ప్లాన్

మీటర్ల డ్రింకింగ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు సీఎంకు అధికారులు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి సిటీకి ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని, గోదావరి ఫేజ్ 2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నిర్దేశించిన గోదావరి ఫేజ్ 2 ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా, కొండపోచమ్మ సాగర్ ను నీటి వనరుగా ఎంచుకోవాలా.. అనే అంశంపై సమావేశంలో చర్చించారు. కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతో పాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండీ అశోక్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. జలమండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీత భత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతుందని వివరించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ. 4,300 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని, కరెంటు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్నఅప్పులున్నాయని, దాదాపు రూ. 8,800 కోట్ల రెవిన్యూ లోటు ఉందని వివరించారు. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జలమండలి తమ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే 20 వేల లీటర్ల నీటిని సిటీలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని అన్నారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్ లు తయారు చేయించాలని చెప్పారు. మంజీరా నుంచి 1965 నుంచి సిటీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, దీంతో రిపేర్లు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## మహారాష్ట్రలో రసవత్తరంగా రాజకీయాలు

ఇంధన వ్యయాన్ని మినహాయించి కిలోమీటరుకు రూ.34.70 నుంచి రూ.35.10 చొప్పున 1,310 బస్సులను అద్దెకు తీసుకునేందుకు షిండే సీఎంగా ఉన్న సమయంలో ఎంఎస్ఆర్టీసీ మూడు ప్రైవేటు సంస్థలకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) ఇచ్చిందని రవాణా శాఖ అధికారులు ఫడ్నవీస్ కు వివరించారు. కిలోమీటర్ కు రూ.22 చొప్పున ఇంధన ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో బస్సుకు కిలోమీటరు వ్యయం రూ.56 నుంచి రూ.57 వరకు ఉంటుందని అధికారులు ఫడ్నవీస్ కు చెప్పారు. 2022లో ఎంఎస్ఆర్టీసీ, ఇంధన ఖర్చులను కలుపుకుని కిలోమీటర్ కు రూ.44 చొప్పున బస్సులను అద్దెకు తీసుకున్న విషయాన్ని ఫడ్నవీస్ దృష్టికి తీసుకువచ్చారు. ఇది ఇప్పటి ఒప్పందం కంటే కిలోమీటరుకు రూ .12 నుండి రూ .13 తక్కువని గుర్తు చేశారు. దాంతో, 1,310 బస్సులను అద్దెకు తీసుకోవాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి ఫడణవీస్ నిలిపివేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అదనపు ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. షిండే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, రవాణా శాఖకు నేతృత్వం వహించినప్పుడు 2024 సెప్టెంబరులో అద్దె బస్సులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. షిండేకు అత్యంత సన్నిహితుడైన భరత్ గోగవాలే 2024 సెప్టెంబరులో ఎంఎస్ఆర్టీసీ చైర్మన్ గా నియమితులయ్యారు. అనంతరం, డిసెంబరులో ఎంఎస్ఆర్టీసీ మూడు ప్రైవేట్ కంపెనీలకు ఎల్వోఐలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఫడ్నవీస్ తాజా నిర్ణయంతో కొత్త మహాయుతి ప్రభుత్వంలో ఎలాంటి విభేధాలు ఉత్పన్నమవుతాయో అన్న అనుమానాలు ప్రారంభమయ్యాయి. ఫడ్నవీస్ తాజా నిర్ణయం రాజకీయ వర్గాల్లో దుమారం రేపింది. ఇది నాటి రవాణా మంత్రిగా ఉన్న షిండేకు, అతని సన్నిహితుడు భరత్ గోగవాలేకు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా శాసనమండలిలో ప్రతిపక్ష నేత అంబాదాస్ దన్వే అద్దె బస్సు పథకాలకు ప్రైవేటు సంస్థలు కోట్ చేసిన రేట్లను ప్రస్తావించారు. రేటు చాలా ఎక్కువగా ఉందన్న ఆరోపణలను షిండే తోసిపుచ్చారు. టెండర్ ప్రక్రియ పారదర్శకంగా ఉందని పేర్కొన్నారు. ముంబైపుణెకు 450 బస్సులు, నాసిక్ఛత్రపతి శంభాజీ నగర్ కు 430 బస్సులు, నాగ్పూర్అమరావతికి 430 బస్సులు కలిపి మొత్తం 1,310 బస్సులకు టెండర్లను ఆహ్వానించారు. దీని ప్రకారం సిటీ లైఫ్ లైన్ ట్రావెల్స్, ట్రావెల్ టైమ్ మొబిలిటీ ఇండియా, ఆంటోనీ రోడ్ ట్రాన్స్పోర్ట్ సొల్యూషన్స్ బిడ్లు దాఖలు చేశాయి.

## ఉప్పల్.. ట్రాఫిక్ తిప్పల్...

కేంద్ర మంత్రి నితిన్ గట్కరి రాష్ట్ర మంత్రులతో కలిసి భూమి పూజ చేసిన విషయం తె లిసిందే.ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి మేడిపల్లిలోని సి పిఆర్ఐ వరకు 6.5 కిలో మీటర్ల వరకు చేపట్టాల్సిన కారిడార్ నిర్మాణ పనుల ప్రారంభించారు. కొంతకాలం చకచకా పనులు ముందుకు సాగాయి. పిల్లర్స్ పూర్తి చేసి కొంత భాగం కొద్ది దూరం వరకు మా త్రమే స్లాబుల్ కూడా వేశారు. ఇంతలోనే ఏమైందో ఏమో కానీ మధ్యలోనే అర్ధాంతరంగా ఇట్టి పనులు నిలిచిపోయాయి. నిర్ణీత గడువులో పూర్తి కావలసిన కారిడార్ నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా ముం దుకు సాగడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య మరిం త తీవ్రమైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నల్లచెరువు వరకు మ ధ్యలో తరచూ వాటర్ లేక డ్రైనేజీ పైప్లైన్ పనులు జ రుగుతుండడం, పగులుతుండడం వల్ల ట్రాఫిక్ సుడిగుండములో వాహనాదారులు ఇరుక్కొని తీవ్ర ఇ బ్బందులకు గురవుతున్నారు. జాతీయ రహదారు లు, జిహెచ్ఎంసి అధికారులు మౌనంగా ఉండడం తో ట్రాఫిక్ పోలీసులు ముందుగా స్పందిస్తున్నారు. విధుల్లో భాగంగా ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఈ స మస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో, ఆదివారం సెలవు దినం రోజు న ట్రాఫిక్ సమస్యతో వాహనాదారులు పడుతున్న క ష్టాలు వర్ణనాతీతం. ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను నెల రోజుల్లోగా తి రిగి ప్రారంభించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ క్రమములో సమస్యను స్వయంగా తెలుసుకోవడానికి ఉ ప్పల్లో పర్యటించారు. ఈ విషయంలో అసెంబ్లీలో కూడా చర్చ జరిగింది. అయినా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పనుల విషయములో జాప్యం జరుగుతోంది. అతిపెద్ద రైల్వే జంక్షన్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. డిసెంబర్ 28వ తేదీన ప్రారంభించాల్సి ఉండగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆకస్మిక మరణం పట్ల రైల్వే జంక్షన్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. త్వరలో ప్రారంభోత్సవం కాను న్న నేపథ్యంలో అప్రోచ్ రోడ్డు ఎంతో అవసరం. ఉ ప్పల్ ప్రధాన రహదారితో పాటు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. వరంగల్ జాతీయ రహదారిలోని చెంగిచర్ల చౌరస్తా నుంచి ఇండియన్ గ్యాస్ చౌరస్తా మీదుగా మల్లాపూ ర్ ఎలిఫెంట్ బ్రిడ్జి వరకు రహదారి విస్తరణతో పాటు మరమ్మత్తులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ప లువురు అభిప్రాయపడుతున్నారు. రైల్వే జంక్షన్ ప్రారంభమైతే మరింత రద్దీ పెరిగే అవకాశం ఉం దని, ప్రజా ప్రతినిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి విస్తరణ పనులతో పా టు మరమ్మత్తులను సైతం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆర్థికంగా బలపడుతున్న భారత్

**భారత్ బలపడుతోంది. ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. కొవిడ్‌తో కల్లోలంగా మారిన భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిన పడుతోంది. ప్రపంచంలో అత్యధిక వేగంతో ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత నిలవనుంది. పలు రంగాలూ మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయి. ముఖ్యంగా నవంబర్ నెలలో కోర్ సెక్టార్ గణాంకాలు 4.3 శాతంగా నమోదయ్యాయి.న్యూ ఇయర్ సందర్భంగా, దేశం ఆర్థిక రంగంలో ఉపశమనం కలిగించే వార్త ఇది.**



నవంబర్ 2024లో కోర్ సెక్టార్ 4 నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. నవంబర్ నెలలో కోర్ సెక్టార్ గణాంకాలు 4.3 శాతంగా నమోదయ్యాయి. అక్టోబర్ నెలలో ప్రధాన రంగాలు 4 శాతం దిగువన కనిపించాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య దాదాపు 8 శాతంగా ఉంది. ప్రభుత్వం వివిధ కోర్ సెక్టార్ గణాంకాలను వెల్లడించింది.ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్, న్యూక్లియర్ ఎనర్జీ, స్పేస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ 2024 సంవత్సరం భారతదేశానికి కీలకమైన సంవత్సరంగా గుర్తింపునిచ్చింది. పరివర్తన విధానాలు, ఆవిష్కరణలు భారతదేశాన్ని ప్రపంచవ్యాప్తంగా నాయకత్వ స్థానానికి నడిపించాయి. స్థిరమైన, సమ్మిళిత వృద్ధికి దోహదపడ్డాయి. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI), బల్క్ డ్రగ్ పార్క్స్ వంటి కార్యక్రమాల ద్వారా ఆధారితమైన 2024తో ముగిసిన దశాబ్దంలో భారతదేశ ఔషధ ఎగుమతులు 15 బిలియన్ల డాలర్ల నుండి 28 బిలియన్ డాలర్లకు పెరిగాయి. బయోటెక్నాలజీ 2014లో 10 బిలియన్ల నుండి 2024లో USD 130 బిలియన్లకు 13 రెట్లు విస్తరించింది. 2030 నాటికి 300 బిలియన్ డాలర్లు లక్ష్యంగా పెట్టుకుంది.2024లో పురోగతిలో భారత్ మొట్టమొదటి స్వదేశీ యాంటీబయాటిక్, నాఫిత్రోమైసిన్, డ్రగ్‌రెసిస్టెంట్ న్యుమోనియాకు వ్యతిరేకంగా విప్లవాత్మక చికిత్సను అందిస్తోంది. క్యాన్సర్ కోసం దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ CART సెల్ థెరపీ అయిన NexCAR19 అందుబాటులోకి వచ్చింది. 30 సంవత్సరాల తర్వాత పెన్సిలిన్ G ఉత్పత్తిని పునఃప్రారంభించడం భారతదేశ ఔషధాల స్వయంవిశ్వాసాన్ని బలపరిచింది. ప్రపంచవ్యాప్తంగా, ఔషధ సరఫరా సవాళ్లను పరిష్కరించడానికి భారతదేశం దక్షిణ కొరియా, అమెరికా, జపాన్, EU లతో పాటు బయోఫార్మాస్యూటికల్ అలయన్స్‌లో చేరింది. విప్తవాత్మక సంస్కరణలు 2024లో దేశీయ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో రూ.1.27 లక్షల కోట్లకు పెంచాయి. ఎగుమతులు 30 రెట్లు పెరిగాయి. ఇక నవంబర్ 2024లో ఎనిమిది ప్రధాన మౌలిక సదుపాయాల రంగాల ఉత్పత్తి 4.3 శాతం క్షీణించింది. విశేషమేమిటంటే అక్టోబర్‌లో ఈ సంఖ్య 3.7 శాతంగా నమోదైంది. నెలవారీ ప్రాతిపదికన, ఈ రంగాల ఉత్పత్తి వృద్ధి నవంబర్‌లో నాలుగు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. మరోవైపు, ఏడాది క్రితం ఇదే నెలలో ఇది 7.9 శాతంగా ఉంది. అంటే వార్షిక ప్రాతిపదికన కోర్ సెక్టార్‌లో పెద్ద క్షీణత కనిపించింది. నవంబర్ 2024లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించింది. బొగ్గు 7.5 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు7.5 శాతం, ఎరువులు 2.9 శాతం, ఉక్కు రెండు శాతం, విద్యుత్ ఉత్పత్తి వృద్ధి 4.8 శాతం, నమోదైంది. గతేడాది నవంబర్‌లో బొగ్గు ఉత్పత్తి 10.9 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు 12.4 శాతం, ఎరువులు 3.3 శాతం, ఉక్కు 9.7 శాతం, విద్యుత్ 5.8 శాతం. సమీక్షలో ఉన్న నెలలో, సిమెంట్ ఉత్పత్తి పెరుగుదల వేగం 13 శాతానికి పెరిగింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌నవంబర్ మధ్యకాలంలో కీలకమైన మౌలిక రంగాల వృద్ధి రేటు 4.2 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 8.7 శాతంగా ఉంది. ఎనిమిది ప్రధాన ప్రాథమిక పరిశ్రమలలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో 40.27 శాతం వాటాను కలిగి ఉంది. చీఫ్ ఎకనామిస్ట్, అదితి నాయర్, కోర్ సెక్టార్ పనితీరులో క్రమానుగత పెరుగుదల, ముఖ్యంగా సిమెంట్ ఉత్పత్తిలో బలమైన వృద్ధికి కారణమైందని అన్నారు. నవంబర్ 2024లో IIP 57 శాతం వృద్ధి చెందుతుందని మేము భావిస్తున్నామని, ఇది ప్రధానంగా వేగవంతమైన మౌలిక సదుపాయాల రంగం వృద్ధి నుండి ప్రయోజనం పొందుతుందని ఆయన అన్నారు.కొత్త ఏడాది ఐటీ రంగానికి కలిసొచ్చేలా ఉంది. ఐటీ ఉద్యోగ నియామకాల్లో దాదాపు 20 శాతం వృద్ధి కనిపించే అవకాశం ఉందని హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్) ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌మెరిడియన్ బిజినెస్ సర్వీసెస్ తెలిపింది. 2024 ఏడాది మొత్తం ఒక్కసారి కలియజూస్తే.. వేగవంతమైన డిజిటల్ పరివర్తన, అభివృద్ధి చెందుతున్న టెక్ ఉద్యోగ ప్రొఫైల్‌ను గమనించవచ్చు. దీని ప్రభావంతో ఐటీ ఉద్యోగాలకు డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో 2025లో కొత్త ఉపాధి అవకాశాలలో ఇంటియన్ IT, టెక్ ఎకోసిస్టంలో 17 శాతం వృద్ధి ఖాయం అని ఫస్ట్‌మెరిడియన్ బిజినెస్ సర్వీసెస్ నివేదిక వెల్లడించింది.ఫస్ట్‌మెరిడియన్ బిజినెస్ సర్వీసెస్ సీఈఓ, ఐటీ స్టాఫింగ్ సునీల్ నెహ్రా మాట్లాడుతూ.. కోవిడ్ సంక్షోభం తర్వాత ఐటీ రంగం తిరిగి ఊపందుకుంది. 2025లో మరింత వృద్ధి కొనసాగుతుంది. అదే సమయంలో అప్లికేషన్ డెవలపర్‌లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, DevOps ఇంజనీర్లు, AI, ML, సైబర్ వంటి ప్రొఫైల్‌లలో సగటున 20 శాతం పెరుగుదల ఖాయమని తెలిపారు. దీనితోపాటు 2024లో ట్రెండ్ సృష్టించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) 2025లో మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని నెహ్రా పేర్కొన్నారు.ఈ రంగంలో డేటా అనలిస్ట్‌లు, డేటా ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు వంటి ఇతర ప్రొఫైల్స్‌కు అధిక డిమాండ్ రానుంది. 2028 నాటికి ఒక్క GenAI ఇండస్ట్రీలోనే ఏకంగా 10 లక్షల కొత్త ఉద్యోగావకాశాలు సృష్టిస్తుందని ఆయన అంచనా వేశారు. జెనరేటివ్ AI ఇంజనీర్, అల్గారిథమ్ ఇంజనీర్, AI సెక్యూరిటీ స్పెషలిస్ట్ వంటి GenAI జాబ్స్‌కు వేతనాలు గతేడాది కంటే భారీగా పెరుగుతాయని పేర్కొన్నారు. ఇది దేశ జీడీపీలో 25 30 శాతం పెరుగుదలను సూచిస్తుంది.

## పోర్టులు.. ఎయిర్ పోర్టులతో..

మొత్తం 1,250 ఎకరాలు ఇప్పటికే గుర్తించారు. అయితే దీనికి సమీపంలో ఐఎఫ్, హెచ్ఎఎల్, బెంగుళూరు ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టులు ఉన్న కారణంగా... ఎయిర్ స్పేస్ అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. ఈ కారణంగా దీనికి సంబంధిత వర్గాల నుంచి ఎన్వోసి తీసుకోవాల్సి ఉందన్నారు . శ్రీకాకుళం ఎయిర్ పోర్టు విషయానికి వస్తే ఫీజిబులిటీ సర్వే పూర్తి అయిందని రెండు ఫేజుల్లో 1,383 ఎకరాల్లో దీన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే భూ సేకరణ ప్రారంభం అయ్యింది. ఫేజ్ 1లో 680, ఫేజ్ 2లో 536 ఎకరాల్లో దీన్ని చేపట్టనున్నారు. దగదర్తి ఎయిర్ పోర్టు నిర్మాణం గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించారు. 1379 ఎకరాల్లో నిర్మించాలని నాడు నిర్ణయించగా... అందులో 635 ఎకరాల భూసేకరణ టీడీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది. మరో 745 ఎకరాలు సేకరణ చేయాల్సి ఉంది. ఈ ఎయిర్ పోర్టుకు అన్ని అనుమతులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బిపిసిఎల్ రిఫైనరీ వస్తోంది. వీటికి తోడు ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇది కార్గోకు, ఇండస్ట్రీకి ఉపయోగపడేలా మంచి ఎయిర్ పోర్టు అవుతుంది. అదే విధంగా శ్రీ సిటీ సెజ్ లో ఎయిర్ స్ట్రిప్ తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సిఎం చంద్రబాబు సూచించారు. ఒంగోలు ఎయిర్ పోర్ట్ కోసం 657 ఎకరాలు గుర్తించామన్నారు. దీనిపై ఫీజిబులిటీ స్టడీ చేయాల్సి ఉందని పల్నాడు జిల్లా పరిధిలో నాగార్జున సాగర్ వద్ద 1670 ఎకరాల్లో ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయనున్నారు. దీనిలో 500 ఎకరాలు సేకరించాల్సి ఉందని దీనికి ఫారెస్ట్ క్లియరెన్స్ కావాలి. తాడేపల్లిగూడెం ఎయిర్ పోర్టు 1123 ఎకరాల్లో చేపట్టాలని నిర్ణయించారు. అయితే దీని సమీపంలో అటు రాజమండ్రి, ఇటు గన్నవరం ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దీంతో ఇక్కడ ఎయిర్ పోర్టు ఫీజిబులిటీని పరిశీస్తున్నారు. ఇకపోతే తునిఅన్నవరం మధ్య 757 ఎకరాల్లో ఎయిర్ పోర్టు తేలవాలని ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాంతంలో రైల్వే లైన్, హైవే, వాటర్ బాడీ ఉందని అధికారులు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్, సిటీలు వస్తున్నాయని... ఆ ప్రాంతంలో ఎయిర్ పోర్టు అవసరం ఉందని సిఎం అన్నారు. అనకాపల్లి, కాకినాడ, విశాఖలకు దగ్గరలో ఈ ఎయిర్ పోర్టు వచ్చేలా చూడాలని సిఎం అన్నారు. అదే విధంగా... తాడిపత్రి ప్రాంతంలో ఒక ఎయిర్ పోర్టుకు అవకాశం ఉందని... దాన్ని కూడా పరిశీలించాలని సిఎం చంద్రబాబు సూచించారు. అనంతరం గన్నవరం ఎయిర్ పోర్టు విస్తరణ పనులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. టెర్మినల్ పనుల్లో నూతన డిజైన్లను అధికారులు సిఎం వద్ద ప్రదర్శించారు. కూచిపూడి నృత్యం, అమరావతి స్థూపాలు థీమ్ గా ఎయిర్ పోర్టు డిజైన్లు సిద్ధం చేశారు. ఈ పనులను 6 నెలల్లో పూర్తి చేసి జూన్ నాటికి అందుబాటులోకి తేవాలని సిఎం సూచించారు. అదేవిధంగా భోగాపురం ఎయిర్ పోర్టు పనుల పురోగతిని కూడా అధికారులు వివరించారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టులతో పాటు ఏవియేషన్ యూనివర్సిటీ, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ఎయిర్ పోర్టుల్లో ప్రైవేటు ఫ్లైట్స్ పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని... వాటిని కూడా దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని సీఎం తెలిపారు .

## నాసా.. ఇస్రో కలిసి ప్రయోగాలు

మార్క్ 3 ప్రయోగాలు చేపట్టబోంది ఇస్రో. ఇందులో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాతో కలిసి ఇస్రో NISAR ప్రయోగం చేపట్టబోతోంది. ఇప్పటికే దీని బడ్జెట్ 12వేల 505 కోట్లుగా ప్రకటించారు. ఫిబ్రవరి లేదా మార్చిలో ఈ ప్రయోగం ఉండే ఛాన్స్ ఉంది. ఈ నాసా ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్ తక్కువ భూకక్ష్యలో తిరుగుతూ భూమిని 12 రోజుల్లో చుట్టేయగలదు. ఇది భూమికి సంబంధించిన విలువైన సమాచారాన్ని అందిస్తుంది. భూమిపై ఉన్న సముద్రాల్లో వచ్చే మార్పులు, భూకంపాలు, సునామీలు వంటి ప్రకృతి విపత్తులను వెంటనే పసిగట్టి సమాచారం ఇస్తుంది. అవసరమైతే శాటిలైట్ చిత్రాలను పంగలదు. దీంతో ఈ ప్రయోగాన్ని ఇటు ఇస్రో అటు నాసా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.ఇక గత దశాబ్ధంగా ఇస్రో నాలుగు వందల మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కమర్షియల్ శాటిలైట్ వెహికిల్స్‌ను లాంచ్ చేయడం ద్వారా సంపాదించింది. అమెరికాకు కూడా 172 మిలియన్ డాలర్ల రెవెన్యూ తెచ్చిపెట్టింది. ఇప్పుడు జీఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలతో సత్తా చాటనుంది. ఎన్వీఎస్ 2 నేవిగేషన్ శాటిలైట్, ఎల్వీయమ్ 3 అండ్ ఎమ్5 మిషన్‌ను కూడా షెడ్యూల్ చేసింది. దీంతో 2025లో కూడా అస్సల్ తగ్గేదేలే అంటున్నారు శాస్త్రవేత్తలు.

## రైతులకు క్షమాపణ చెప్పండి

రైతన్నల నుంచి ప్రమాణపత్రాలు అడగడానికి సిగ్గు ఉండాలి. రైతన్నలకు హామీ ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వమే ప్రమాణ పత్రం చేయాలి. ప్రభుత్వానికి దమ్ముంటే రైతన్నలకు ఇచ్చిన రైతు భరోసా పైన లబ్ధిదారుల జాబితా బయట పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో కౌలు రైతులకు, రైతు కూలీలకు రైతుబంధు ఇచ్చారో సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. రైతు భరోసాకు దరఖాస్తులంటూ కొత్త డ్రామా మొదలుపెట్టింది. ప్రజాపాలన అభయ హస్తం పేరుతోనే ప్రజలందరి నుంచి దరఖాస్తులు తీసుకుంది. 6 గ్యారంటీల కోసమని కోటి ఆరు లక్షల మంది దగ్గర దరఖాస్తులు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంది.దరఖాస్తుల పేరుతో కాంగ్రెస్ కాలయాపన చేస్తోంది. గతంలో శాసించే స్థాయికి తెచ్చిన రైతన్నను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం యాచించే స్థితికి తీసుకువచ్చింది. గతంలో ప్రమాణాలు పెట్టి ఓట్లు పెట్టి గుడుల దగ్గరికి పోయిన కాంగ్రెస్ నేతలు నేడు రైతన్నలతోని ప్రమాణ పత్రాలు అడుగుతోంది. ప్రమాణపత్రాలు అడగడానికి సిగ్గు ఉండాలి. ప్పుటి దాకా రైతుల నుంచి కొన్న పంట కొనుగోలు వివరాలు, ఇచ్చిన బోనస్ వివరాలను వివరాల జాబితాలను గ్రామాలలో పెట్టాలి. మేం రైతుబంధు పథకాన్ని తీసుకువస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని బొంద పెట్టాలని చూస్తోంది. రైతు బంధులో 22000 కోట్లు పక్కదారి అని దుష్ప్రచారం చేస్తుంది. గ్రామాల వారీగా దుర్వినియోగంపై జాబితా విడుదల చేయాలి. పత్తి రైతుకి, కంది రైతుకి, పసుపు, చెరుకు, పోడు భూముల రైతన్నలకు ఇచ్చిన రైతుబంధును దుబారా అని ప్రభుత్వం అబద్ధాలు ఆడుతున్నది. ప్రమాణ మాత్రం ఎందుకివ్వాలని రైతన్నలు ప్రభుత్వాన్ని నిలదీయాలి. గతంలో 12 సార్లు డబ్బులు వచ్చాయని ప్రభుత్వానికి చెప్పాలి. ఇప్పటికే ఒక్కో రైతుకి ఎకరానికి 17500 వేల చొప్పున రాష్ట్ర రైతులకు రూ.26 వేల కోట్లకు పైగా బాకీ పడింది. రూపాయి లంచం లేకుండా కోటి 52 లక్షల మందికి రైతుబంధు వేశాం. రుణమాఫీ, రైతు భరోసా గురించి అడిగితే రైతులను బిచ్చగాళ్ళని మంత్రులు అంటున్నారు. రైతుల పట్ల ఉన్న ఆలోచన ధోరణి ఇది. వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయాలి. 22 లక్షల కౌలు రైతాంగానికి రేవంత్ రెడ్డి ఉత్తరం రాసిండు. ఇప్పుడు రైతు భరోసా ఎగ్గొట్టడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాము. కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ప్రజలకు తెలియజేసి రాష్ట్రరైతాంగాన్ని చైతన్యవంతం చేద్దాం. సంక్రాంతిలోగా రైతు భరోసాను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం. ఎన్నికల్లో చెప్పకున్నా దేశ చరిత్రలో రైతుకి పెట్టుబడి సాయం ఇచ్చిన ఏకైక నాయకుడు కేసీఆర్ ఒక్కరే. ఎలాంటి దరఖాస్తులు చేయకుండా రైతుబంధు అందించాం. 11 సీజన్లలో రూ.73 వేల కోట్లు రైతుల ఖాతల్లోకి వేశాం. 12వ సీజన్లో రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్ కు లేఖరాసి ఆపింది. ఏడాది దాటినా రైతు భరోసా రూపంలో రైతన్నలకు ఒక్క రూపాయి ఇయ్యలేదు. బీఆర్ఎస్ దాచిపెట్టిన 7500 కోట్లు మాత్రమే రైతు భరోసా పేరుతో ఇచ్చారు. వరంగల్లో రాహుల్ గాంధీని తెచ్చి రైతన్నలను ఉద్ధరిస్తామని చెప్పారు. రైతు డిక్లరేషన్ లో భాగంగా ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఇప్పుడు రైతులతోనే ప్రమాణ పత్రాలు తీసుకుంటూ వారిని ఆందోళనకు గురిచేస్తోంది' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు చెరిగారు.



# దశాబ్దాల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం

- జూలై 15 లోగా మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావలసిందే
- రిటైనింగ్ వాల్ భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలి
- ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఏడు రోజులలో నివేదిక అందించాలి
- రెవెన్యూ ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**జయభేరి, ఖమ్మం :**

దశాబ్దాల నుండి ఖమ్మం పాలేరు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న మున్నేరు వాగు ముప్పు సమస్యకు మరో ఏడు నెలల్లోగా శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్నేరు నది ఒడ్డున ముంపునకు గురవుతున్న నివాస కాల నీలకు శాశ్వత పరిష్కారం చూపుతూ నదీ తీరం వెంబడి రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల ఆర్‌సిసి రిటైనింగ్‌వాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జూలై 15 వ తేదీలోగా ఎట్టి పరిస్థితులలోనూ పనులను పూర్తి చేసి తీరాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి 234 ఎకరాల భూమి అవసరం ఉండగా 64 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉండగా 170 ఎకరాలు పట్టా భూములు ఉన్నాయని వెంటనే ఈ భూములను సేకరించడానికి యజమానులతో మాట్లాడి యుద్ధ ప్రతిపాదికన భూసేకరణ జరపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో మున్నేరు వాగు పొంగి పొర్లడం వల్ల ఖమ్మం, పాలేరు నియోజకవర్గం ప్రజలు తరచూ వరద సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇటువంటి పరిస్థితిని నియంత్రించడానికి రిటర్నింగ్ వాల్ నిర్మాణం ఒకటే పరిష్కారం అని అన్నారు. రిటైనింగ్ వాల్ డిజైన్ చేసే సమయంలో చెక్ డ్యాం ప్రవాహం పరిగణలోకి తీసుకున్నారా, నగరంలోని క్యాచ్ మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద అంచనా ఎంత వంటి వివరాలను ఈ సందర్భంగా మంత్రి ఆరా తీశారు. ప్రతి నెల రెండు రోజులు ఈ పనులను తనిఖీ చేయడం జరుగుతుందని, ప్రతి రోజూ ఎంత మేరకు పని జరగాలో ప్రణాళిక తయారు చేసుకోవాలని, పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఫీల్డ్ లెవల్లో ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు పనుల పురోగతి వివరాలు వాట్సాప్ లో అప్‌డేట్ చేయాలని అన్నారు. మున్నేరు నది ఎఫ్.ఎస్.టి. వివరాలు తెలుసుకున్న మంత్రి, గత సెప్టెంబర్ లో వచ్చిన విధంగా భారీ వరదలు వస్తే ఎంత మేరకు నీరు చేరుతుంది, అధికంగా ఫోర్స్ తో నీటి ప్రవాహం వచ్చినప్పుడు తట్టుకునేందుకు రిటైనింగ్ వాల్ లో పాటించాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ఎంజాయ్ మెంట్ సర్వే రెండు రోజులలో పూర్తి చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్ కు తెలిపారు. ఎన్.ఎస్.పి. సంబంధించిన భూములు, ఖమ్మం అర్బన్ లోని భూములు ఎంత సేకరించాలి, దానికి నిర్దేశించుకున్న ప్రణాళిక ఇటువంటి పూర్తి వివరాలు నివేదికలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మున్నేరు నది బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల వివరాలు, ఖమ్మం అర్బన్ పరిధిలో ప్రభుత్వ భూములలో జరిగిన ఆక్రమణలకు సంబంధించి వారం రోజులలో పూర్తి నివేదిక అందించాలని రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. భూ సేకరణ కోసం సంబంధిత రైతులతో సంప్రదింపులు జరిపేందుకు నిపుణుల కమిటీ నియమించుకోవాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చేలా చూడాలని అన్నారు. ఎంజాయ్ మెంట్ సర్వేలో ప్రభుత్వ భూములు ప్రైవేటు భూములుగా క్రింది స్థాయి సిబ్బంది ఎక్కడైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడ ఎటువంటి అవకతవకలకు పాల్పడడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో మున్నేరు నది వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ, నిధులపై ప్రణాళిక తయారు చేశామని అన్నారు. గతంలో ఎన్నడు మున్నేరు నది వద్ద లక్షా 70 వేల క్యూసెక్కుల మించి వరద రాలేదని, సెప్టెంబర్ 2024 లో మాత్రం 3 లక్షల 12 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని 3 లక్షల 50 వేల క్యూసెక్కుల ప్రవాహం సామర్థ్యం, 15 మీటర్ల ఎత్తు , 6 మీటర్ల వెడల్పుతో రూరల్, అర్బన్ ప్రాంతంలో 8.5 కిలోమీటర్ల చొప్పున 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ కొరకు శాస్త్రీయంగా తయారు చేశామని అన్నారు. రిటైనింగ్ వాల్ సంబంధించి 234 ఎకరాల 20 గుంటల భూసేకరణలో ప్రభుత్వ భూమి 60 ఎకరాలు 31 గుంటలు ఉందని, ప్రైవేట్ భూముల 173 ఎకరాల 29 గుంటల భూమి ఉందని, 28 నిర్మాణాలు తొలగించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర రావు, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి
- మెట్రో రైలును శామీర్ పేట వరకు పొడిగించడం పట్ల సీఎం కు ధన్యవాదాలు తెలిపిన నేతలు

**జయభేరి, జనవరి 3:**


తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి కలిశారు. శుక్రవారం జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు . అనంతరం ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మెట్రో రైలును జేబీఎస్ నుండి శామీర్ పేట్ వరకు పొడిగించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలకు మరిన్ని పథకాలు ప్రవేశ పెట్టాలని జైపాల్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్ , ఘనపురం మాజీ సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి ,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఓపెన్ జిమ్ ఉంటే.. ప్రజలకు ఉపయోగకరం

- ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్

**జయభేరి, ఘట్కేసర్ :**



ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల కళాశాల మైదానం లో ఓపెన్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపిన ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంతో పాటు, యువకులకు శారీరక ధారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి గతంలో కొన్ని చోట్ల ఓపెన్ ఏర్పాటు చేశామని అదేవిధంగా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గురుకుల కళాశాల మైదానంలో నిత్యం ఎంతో మంది వాకర్స్ ఉంటారని అదేవిధంగా యువత రన్నింగ్ చేస్తారని, ఇలాంటి చోట ఒక ఓపెన్ జిమ్ ఉంటే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భవిస్తూ రానున్న రోజుల్లో 12 లక్షల రూపాయల నిధులతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, గురుకుల్ వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సారా శ్రీనివాస్ గౌడ్, సభ్యులు మంగు శ్రీనివాస్ రావు, గోదా సురేష్ యాదవ్, శ్వేతా రెడ్డి, బిందు నవీన్, రాజు, శంకర్, ఈశ్వర్, రవి శంకర్, బాలకృష్ణ, అంకం సురేష్ యాదవ్, నాగరాజు, గాజుల వీరేందర్ యాదవ్, శంకర్, పల్లె విజయ్ గౌడ్, రవి కాంత్, రాజు గౌడ్, హరి మోహన్ రెడ్డి, గణేష్ గౌడ్, బాబ్ల్యా, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి చర్యలు

- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను వెంటనే ఎంపిక చేయాలి
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై సమీక్షించిన మంత్రి పొంగులేటి

**జయభేరి, ఖమ్మం:**



సంక్రాంతి లోపు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘు రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగులో 84, కూసుమంచి మండలం దుబ్బ తండ (ఎర్రగడ్డ తండ)లో 29, నేలకొండపల్లి మండలం ఆచర్లగూడెం లో 18, మొత్తం 131 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారుల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వీటిని పేదలలో నిరుపేదలను ఎంపిక చేసి వారికి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. పాలేరు అసెంబ్లీ పరిధిలో 209 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఇండ్లకు కూడా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఆ ఇండ్లు వారికి కేటాయించాలని, మిగిలిన పనులు చేసేందుకు ప్రణాళికలు, అవసరమైన నిధుల నివేదిక తయారు చేయాలని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాకపోతే ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని సందేశం బలంగా వెళ్లాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, హౌజింగ్ పిడి శ్రీనివాసరావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## హెచ్ బిఎల్, జె డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ప్రారంభం

- గ్రంథలయాలతో మేధో సంపత్తి పెంపొందుతుంది : జె డి లక్ష్మీనారాయణ

**జయభేరి, జనవరి 3:**

గ్రంథాలయాలు విజ్ఞాన సంపదను పెంపొదిస్తాయని జె డి లక్ష్మీనారాయణ అన్నారు. మేడ్చల్ జిల్లా కేశవరం, మూడు చింతలపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో హెచ్ బి ఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ మరియు జె డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా గ్రంథాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జె డి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని, వారిని సన్మార్గంలో నడిపించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలల్లో గ్రంథాలయలను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, శ్రద్ధగా చదువుకొని అటు తల్లిదండ్రులకు ఇటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులు భవిష్యత్తులో ఒక అతిథిగా రావాలని కోరారు. అనంతరం హెచ్ బి ఎల్ సంస్థ ఛైర్మన్ సతీమణి ఉమాదేవి, సీఎస్ ఆర్ జనరల్ మేనేజర్ హనుస్ స సూర్పనేని , సిఎస్ ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ హెచ్ బి ఎల్ సంస్థ నుంచి మారుమూల గ్రామాల్లోని పిల్లలకు పోషక విలువలతో కూడిన పౌష్టకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాం రవి, మాజీ ఎంపీటీసీ గోనె హనుమత్ రెడ్డి,సిఎస్ ఆర్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

- ఉమ్మడి శామీర్ పేట మండలాల విద్యాధికారులు
- పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచన




**జయభేరి, జనవరి 3:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండల విద్యా వనరుల కేంద్రంలో టీ ఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాల విద్యాధికారులు వసంత కుమారి, భాగ్యమని హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ బాగుండాలని కోరారు. పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీదేవిజ నాయక్, శామీర్ పేట మండల అధ్యక్షులు పి. తిరుమలేశ్, మండల ప్రధాన కార్యదర్శి కుమార్, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేటలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

- సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఉద్యమ నాయకులు మహ్మద్ అబ్జల్ ఖాన్




**జయభేరి, జనవరి 3:**

సావిత్రి బాయి పూలే జీవితం అందరికి ఆదర్శప్రాయం అని సీనియర్ ఉద్యమకారులు, కాంగ్రెస్ నేత అఫ్జల్ ఖాన్ తెలిపారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా మేడ్చల్ జిల్లా శామీర్ పేటలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు సావిత్రి బాయి పూలే తన భర్త జ్యోతి రావు పూలే తో కలిసి సమాజ సేవ లో చురుగ్గా పాల్గొన్నారని, ముఖ్యంగా మహిళల విద్యా వ్యాప్తి కి విశేష కృషి చేశారని అన్నారు. ఈ క్రమంలో సమాజం లో ని కొన్ని వర్గాల నుంచి ఎన్నో అవరోధాలు, కష్టాలు ఎదురయ్యాయని అయినా ధైర్యంగా ముందుకు వచ్చి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసి సాఫల్యం పొందారని అన్నారు. ఆమె చేసిన సేవలకు గుర్తుగా సావిత్రి బాయి జయంతి రోజును జాతీయ మహిళా ఉపాధ్యాయ దినంగా పాటిస్తున్నారని అన్నారు. సమాజం లో ని ప్రతి ఒక్కరు వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, శశికాంత్ యాదవ్, బోయిని బలరామ్, రాంబాబు, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజహితం కోసమే సచ్చిదానంద పని

**జయభేరి, విజయవాడ, జనవరి 3:**

ఉమ్మడి రాష్ట్రంలో విజన్ 2020 అని ప్రకటిస్తే చాలా మంది తప్పుబట్టారని.. కానీ, ఆ విజన్ ఫలితాలు నేడు అందరికీ కనిపిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడ పటమటలోని దత్త పీఠాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఎంకు గణపతి సచ్చిదానంద స్వామి ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్రంలోని 42 ప్రాంతాల్లో చేపట్టబోయే దత్త క్షేత్రనాథ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు అనంతరం మాట్లాడారు. సమాజహితం కోసమే సచ్చిదానంద పని చేస్తున్నారని కొనియాడారు. 'స్వామీజీని దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. సంపద రావాలి.. ప్రజలు సంతోషంగా ఉండాలి. ఈ విషయంలో వెనకడుగు వేసేదే లేదు. ఆ భగవంతుడి ఆశీస్సులు కూడా మనకు తోడుగా ఉండాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి. పేదరికం పూర్తిగా పోవాలి. ప్రజలు సంతోషంగా ఉండాలి. పేదరికం పూర్తిగా పోవాలి. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర వైపు తీసుకెళ్లే బాధ్యత నేను తీసుకుంటాను. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం.' అని చంద్రబాబు స్పష్టం చేశారు.



# గ్రామంలో మద్యం అమ్మితే 5 లక్షలు కట్టు..!

- మద్యం అమ్మొద్దు.. తాగొద్దు
- తిమ్మాపూర్ గ్రామస్తుల తీర్మానం

**జయభేరి, గజ్వేల్ (జగదేవపూర్), జనవరి 03:**

గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మొద్దని, తాగొద్దని జగదేవపూర్ మండలంలో తిమ్మాపూర్ గ్రామస్తులు శుక్రవారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మడంతో చాలా గొడవలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే చాలామంది మద్యానికి బానిసలుగా పచ్చని సంసారంలో చిచ్చులు రేగుతున్నాయని స్పష్టం చేశారు. అందుకు గ్రామస్తులమంతా కలిసి ఒక తాటిపైకి వచ్చి గ్రామంలో మద్యం అమ్మొద్దు తాగొద్దని తీర్మానం చేసినట్లు తెలిపారు. మద్యం అమ్మితే రూ. 5 లక్షల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. అలాగే ఎవరైనా మద్యం కొనుగోలు చేస్తే పదివేల జరిమాన విధిస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా దొంగ చాటున మద్యం అమ్మితే ఆ సమాచారాన్ని గ్రామస్తుల దృష్టి తీసుకువస్తే వారికి ఐదు వేల రూపాయలు ప్రోత్సహకం అందిస్తామని చెప్పారు. మద్యం లేని మధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని పేర్కొన్నారు. తీర్మాన పత్రాన్ని జగదేవపూర్ ఎస్సై చంద్రమోహన్ కూడా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు




**జయభేరి, వర్గల్, జనవరి 03 :**

వర్గల్ మహిళా డిగ్రీ కళాశాలలో నేడు సావిత్రి బాయి పూలే జయంతోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాల ప్రధానాధ్యాపకులు డాక్టర్ గడ్డం భాస్కర రావు సావిత్రిబాయి పూలే జీవితం మరియు మహిళల కోసం తను చేసిన సేవను గూర్చి వివరించారు.. కళాశాల ఉప ప్రధాన అధ్యాపకులు పి గోవిందరావు స్త్రీవిద్య యొక్క ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వివిధ శాఖల అధ్యాపకులు అందరూ ఈ జయంతోత్సవములో పాల్గొన్నారు.

## మాదిగ మహావీరులరా మేల్కొడి..!

- చలో గజ్వేల్ మాదిగ.. 02 ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం



**జయభేరి, గజ్వేల్, జనవరి 03 :**

గజ్వేల్ నియోజకవర్గంలో ఐదవ తేదీన జరగబోయే మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం మాదిగలు ఒక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మందకృష్ణ నాయకత్వంలోనే మాదిగలకు, మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ములుగు మండలంలోని వివిధ గ్రామాలలో మాదిగ నాయకులను కలిసిన గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు కొమ్ము నవీన్ కుమార్ ములుగు మండల గ్రామాలలో ఊరురా తిరుగుతూ మాదిగల ఐక్యతే మాన లక్ష్యం అంటున్న కొమ్ము నవీన్ కుమార్ తో మేమూ సైతం అంటు ముందుకు వచ్చిన ములుగు మండల గ్రామాలు బండ మైలారం కొత్తూరు కొక్కొండ సింగానగూడ అచ్చయ్యపల్లి లక్ష్మక్కపల్లి, నాగిరెడ్డిపల్లి, మామిడ్యాల్, బహిలంపూర్ ప్రతి గ్రామంలో పది పది డప్పులతో ఈ ఆత్మీయ సమ్మేళనకు హాజరవుతామని అన్నారు. బస్వాపూర్ గ్రామంలో నవిన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాదిగలు ఎమ్మార్పీఎస్ నాయకులు చెలిమెల శ్రీను, నాగరాజు, రవి, కనకరాజు,గడ్డం మహేశ్, అనంతరం వెంకటేష్, అనంతరం విష్ణు, జాంగిర్ అంజి, స్వామి ,మహేందర్, ధనరాజ్, చిగురుపల్లి రాజు, పాల్గొన్నారు.

## అనంతరావుపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం



**జయభేరి, గజ్వేల్, జనవరి 03 :**

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ వారి సహకారంతో గజ్వేల్ మండలం అనంతరావు పల్లి గ్రామం లో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు ఈ సందర్భంగా డాక్టర్ రాంజీ డాక్టర్ రాజిరెడ్డి గోపాల మిత్ర గౌరీ శంకర్ మాట్లాడుతూ పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు వైద్యం అందజేయడం జరుగుతుందని పాడి రైతులు, జబ్బు చేసిన పశువులను పశువుల డాక్టర్లకు చూపించాలని కోరారు,ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిహాల్ రెడ్డి సింగాటం పశు వైద్యశాల డాక్టర్, వి.ఏ. కిరణ్, వి.ఏ. మహేందర్, గోపాలమిత్ర సూపర్వైజర్,భాస్కర్ గౌడ్, ఓఎస్ శంకర్, మహేందర్, యాదగిరి, మల్లేష్, పాడి రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను నమ్మించి గొంతు కోస్తున్నారా..!

- చట్టబద్ధమైన హామీతో.. బిసి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి
- డెడికేషన్ కమిటీ పేరిట కాలయాపన చేస్తున్న కాంగ్రెస్
- 42% రిజర్వేషన్ అమలుతోనే ఎన్నికలకు వెళ్లాలి
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి



**జయభేరి, గజ్వేల్, జనవరి 03 :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే చట్టబద్ధమైన బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని కామారెడ్డి కాంగ్రెస్ డిక్లరేషన్ లో ప్రకటించిందని, అయితే నేటికీ అతీ గతీలేదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సావిత్రి బాయి పూలే జయంతి పురస్కరించుకొని హైదరాబాదులో ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బీసీ సదస్సుకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్న సందర్భంగా గజ్వేల్ లో ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. అప్పటి పిసిసి అధ్యక్షులు ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 23 శాతం నుండి వెంటనే 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ అమలుకు డెడికేషన్ కమిటీ వేసి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు.

అయితే 42% రిజర్వేషన్ అమలు చేస్తేనే ఎన్నికలు చేపట్టాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే 42 బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా 42% పేరిట గొప్ప నాటకం ఆడిన కాంగ్రెస్ నిజ స్వరూపం అయిందని, నమ్మించి గొంతు కోయడమే కాంగ్రెస్ లక్ష్యమని ఎద్దేవా చేశారు.

అంతేకాకుండా బీసీ సంక్షేమానికి ప్రభుత్వం నిబద్ధతను చూపిస్తూ ప్రతిష్ట చర్యలు చేపట్టాలని క్రిమిలేయర్ విధానం బీసీలకు సమాన విద్య, ఉద్యోగ అవకాశాలకు అడ్డుగా ఉన్నందున వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. బీసీలకు సామాజిక న్యాయం సాధించే క్రమంలో ఐక్యంగా ముందుకు సాగుతామని, కామారెడ్డి డెకరేషన్లో ప్రకటించిన హామీల అమలుకు ఉద్యమిస్తామని, పోరాటం చేపడతామని స్పష్టం చేశారు. అంతేకాకుండా బీసీలకు లక్ష కోట్లతో సమగ్రాభివృద్ధి చేపట్టాలని, ప్రభుత్వ కాంట్రాక్టులో సైతం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని, ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బిసిడి నుండి బీసీ ఏ కుమార్చాలని డిమాండ్ చేశారు.

# హకీంపేట్ నిసాలో ఘనంగా గ్రాండ్ పాసింగ్

- శిక్షణ పూర్తి చేసుకున్న 31 వ బ్యాచ్ కు చెందిన 1300 ల మంది ట్రైనీ కానిస్టేబుళ్లు
- అవుట్ పరేడ్ కు హాజరైన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ రాజ్ విందర్ సింగ్ భట్టి




**జయభేరి, జనవరి 3:**

హకింపేట్ లోని నిసా లో గ్రాండ్ పాసింగ్, అవుట్ పరేడ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ 31 వ బ్యాచ్ కానిస్టేబుల్, ఫైర్ బేసిక్ ట్రైనీ ల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఈ బ్యాచ్ లో 1300 మంది ట్రైనీలు ఉండగా 27 వారాలు అగ్నిమాపక శిక్షణ, 15 వారాలు భద్రతా శిక్షణను పొందారు. కాగా ఈ పాసింగ్ ఔట్ పరేడ్‌కు సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ రాజ్ విందర్ సింగ్ భట్టి ముఖ్య అతిథిగా హాజరై పరేడ్‌ను పరిశీలించి శిక్షణ పొందిన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అదేవిధంగా నిసా డైరెక్టర్ సునీల్ ఇమ్మాన్యుయేల్ శిక్షణకు ఎంపికైన అభ్యర్థులచేత ప్రమాణం చేయించారు. కాగా విశాంత్ బసోత్రా కానిస్టేబుల్, ఫైర్ ఆల్ రౌండ్ బెస్ట్, ఇండోర్ బెస్ట్‌గా ఎంపికయ్యాడు. అదేవిదంగా సోను కుమార్ కానిస్టేబుల్, ఫైర్ డ్రిల్‌లో బెస్ట్‌గా ఎంపికయ్యాడు. వీరికి ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన పోలీసు, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లోని సీనియర్ అధికారులు, సిఐఎస్ఎఫ్ హైదరాబాద్‌లోని యూనిట్ హెడ్‌లు, శిక్షణ పొందిన వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారికంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలి

- యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సెమినార్
- USFI తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి



**జయభేరి, గజ్వేల్, జనవరి 03 :**

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే గారి జయంతి సందర్భంగా గజ్వేల్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ సెమినార్ కి యుఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి గారు, హాస్టల్ వార్డెన్స్ లక్ష్మి , స్వప్న గార్లు హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారత దేశంలోనే స్వాతంత్రం రాక ముందు నుంచే మహిళల అభ్యున్నతి కోసం, మహిళలు ముఖ్యంగా చదువుకున్నప్పుడే వారి జీవితాలు అభివృద్ధి చెందుతాయని బలంగా నమ్మి చివరి శ్వాస వరకు పోరాడారు.. మహాత్మ జ్యోతి రావు బాపులే గారి అడుగుజాడల్లో నడుస్తూ వితంతువుల కోసం, ఒంటరి మహిళల కోసం, సతిసహగమనానికి వ్యతిరేకంగా మహిళల స్వేచ్ఛకై ఎంతో ఎనలేని కృషి చేశారు. ప్రస్తుతం భారతదేశంలోని అమ్మాయిలు సావిత్రిబాయి పూలే గారిని ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికై పాటుపడాలని అన్నారు. సావిత్రిబాయి పూలే, జ్యోతి రావు పూలే దంపతులు పిల్లల్ని కూడా కనకుండా ఈ సమాజ అభివృద్ధి కోసం పాటుపడ్డారు. చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి. మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు తీసుకువచ్చిన కూడా మహిళలపై దాడులు ఆగడం లేదు కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవతో ఈ దాడులను అరికట్టే విధంగా పనిచేయాలి. దేశంలో హాస్టల్లో చదువుకుంటున్న అమ్మాయిలకు ప్రత్యేకమైనటువంటి హెల్త్ మరియు కాస్మోటిక్ కిట్ లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలి . సావిత్రిబాయి పూలే గారి జయంతిని అధికారికంగా దేశవ్యాప్తంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా జరపాలని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా రాష్ట్ర మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు రంజిత్, కార్తీక్, ప్రవీణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి భాయ్ పూలేకు నివాళులు

- బండి రజనీ కుమార్




**జయభేరి, హన్మకొండ, జనవరి 03:**

మహనీయురాలు భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలో సావిత్రి భాయ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించిన హసన్ పర్తి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డా. బండి రజిని కుమార్.

ఈ కార్యక్రమంలో దేవన్నపేట మాజీ సర్పంచ్ చుంచు రవి, పిఏసిఎస్ డైరెక్టర్ చుంచు విజేందర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సూరం వాసుదేవ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి చేసే దిశగా భవనానికి మరమ్మత్తులు

- పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయాన్ని పరిశీలించిన వరంగల్ కుడా ఛైర్మన్, ఎమ్మెల్యే

**జయభేరి, హన్మకొండ, జనవరి 03:**

హనుమకొండ సుబేదారిలోని పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయాన్ని వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే లతో కలిసి శుక్రవారం కార్యాలయం తోపాటు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. క్యాంప్ కార్యాలయాన్ని హెరిటేజ్ భవనంగా 'కుడా' ఆధ్వర్యంలో ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసే దిశగా భవనాన్ని మరమ్మత్తు పనులు చేయించి అందుబాటులోకి తీసుకురావడానికి గల అవకాశాలను గురించి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు

**జయభేరి, మార్కుక్, జనవరి 03:**

మర్కూక్ మండల పరిధిలోని వరదరాజపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది అనంతరం ప్రభుత్వం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించుకోవడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ప్రకటించడం హర్షనీయమని అన్నారు మహిళలందరిని సమానంగా గౌరవించాలని , సమాన అవకాశాలు కల్పించాలని అన్నారు నేడు మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఇంటి నుండి చిన్నపిల్లలు నుండి స్త్రీ పురుషులు అని లేకుండా సమానంగా చూడడం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెడ్మాస్టర్ వెంకటేశ్వర్ రెడ్డి రామచంద్రం మల్లేశం మైథిలి వందన కవితా సంతోషి సుతిష్ణ మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా కార్యదర్శి బాల లక్ష్మి పాల్గొన్నారు.

## అర్ఎస్ ప్రవీణ్ కు స్వాగతం

- బండి రజనీ



**జయభేరి, హన్మకొండ, జనవరి 03:**

శుక్రవారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరకాల పర్యటనలో భాగంగా దేవన్నపేట రింగ్ రోడ్డు మీదగా వెళ్తున్న క్రమంలో మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి శాలువా, పూల బొకేతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన బిఅర్ఎస్ హసన్ పర్తి మండల అధ్యక్షులు బండి రజనీ కుమార్. ఈ కార్యక్రమంలో బండి తో పాటుగా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి

- సమ్మెకు సంఘీభావం తెలిపిన ప్రతాప్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, జనవరి 03 :**



సిద్దిపేట కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధపు అసత్య హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి సర్కార్ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనంతో పాటు వారి క్రమబద్ధీకరణ హామీని వెంటనే రేవంత్ రెడ్డి అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే టీ, కాఫీ తాగే సమయంలో మీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి మాట తప్పడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న లక్ష కాఫీలు తాగినా కానీ రేవంత్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన మాటను మాత్రము నిలబెట్టుకోలేదని అన్నారు. ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు.మొన్నటికి మొన్న ఆశా వర్కర్లు రోడ్ ఎక్కారన్నారు నేడు సర్వ శిక్షణ ఉద్యోగస్తులు సమ్మెలు చేయడం కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వానికి సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యోగులకు జీతాలను పెంచిందని గుర్తు చేశారు. కెసిఆర్ ప్రభుత్వం కరోనా వచ్చి రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆదాయం తగ్గిన కూడా ఉద్యోగులను అన్ని విధాలుగా వేతనాలను పెంచి గౌరవించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగస్తులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల కలెక్టరేట్ల ముందు దాదాపు 19,500 మంది సమ్మె చేస్తున్న కనీసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. ప్రజల్ని నమ్మించి ఎలా మోసం చేయాలో రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. రేవంత్ రెడ్డి మార్పు అంటే తెలంగాణ రాష్ట్రం ధర్నాలతో రాస్తారోకోలతో సమ్మెలతో దద్దరిల్లుతోందని వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. బిఆర్ఎస్ తరపున పూర్తి సంఘీభావం ఉద్యోగస్తులకు ఉంటుందని వంటేరు ప్రతాపరెడ్డి భరోసాని ఇచ్చారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ సంఘ అధ్యక్షులు బాలకృష్ణ, కర్ణాకర్, నవీన్ కుమార్, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ పట్టణంలో హెల్మెట్ ర్యాలీ

- వాహనదారులకు పూలదండ వేసి సన్మానిస్తున్న పోలీసులు
- జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఆదేశానుసారం
- గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి

**జయభేరి, గజ్వేల్, జనవరి 03 :**



జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ ఆదేశానుసారం గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, సిబ్బందితో కలిసి గజ్వేల్ పట్టణంలో హెల్మెట్ ర్యాలీని ప్రభుత్వ హాస్పిటల్ చౌరస్థా నుండి ఇందిరా పార్క్, పిడిచేడ్ రోడ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. హాస్పిటల్ చౌరస్తా వద్ద హెల్మెట్ గురించి అవగాహన నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి పూలదండలు వేసి హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా, కృంగదీస్తుందని తెలిపారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపినచో ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు.





# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

- నల్గొండ జిల్లా కేంద్రంలో డాన్ బాస్కో హై స్కూల్ లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో దేవరకొండ విద్యార్థులు సత్తా చాటారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు తమ ప్రదర్శన ద్వారా నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు.

**జయభేరి, దేవరకొండ :**

ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా దేవరకొండ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో రోబోతో ప్రతిభ కనబరిచి ఔరా అనిపించారు. విద్యార్థులు తయారుచేసిన నమూనాలను అతిథులకు వివరించిన తీరును విద్యార్థుల ప్రతిభను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , జిల్లా విద్యాధికారి బిక్షపతి అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలన్నారు.

# సావిత్రిబాయి పూలే సామాజిక విప్లవకారులు

- విద్యా దేవి వాయిస్ అఫ్ టీచర్ సంపాదకులు
- భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి చిరస్మరణీయం
- బ్రాహ్మనిజం పై పోరే సావిత్రిబాయికి నిజమైన నివాళీ

**జయభేరి, హన్మకొండ జనవరి 03:**




శుక్రవారం కాజీపేట పట్టణం ఫాతిమాలోని ఫాదర్ కొలంబో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ తరపున భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిదిగా హాజరైన విద్యాదేవి వాయిస్ ఆఫ్ టీచర్ తెలంగాణ పత్రిక సంపాదకురాలు మాట్లాడుతూ భారతదేశంలో అగ్రవర్ణ వ్యవస్థ ఆధిపత్యం వహిస్తున్న సమయంలో జ్యోతిబాపూలే చదువు నేర్చుకుని తన భార్య సావిత్రిబాయి పూలేకి చదువు నేర్పి ఇంటి నుండే సమాజ మార్పును మొదలుపెట్టారని కొనియాడారు. ఆ మార్పు పూర్తి మహారాష్ట్ర అలాగే దేశమంతా వ్యాప్తి చెంది ఎంతోమందిని నిరక్షరాశులకు ముఖ్యంగా మహిళలు నిమ్న వర్గాల ప్రజలకు సత్యశోధకు సమాజ్ ద్వారా చదువు నేర్పించి వారి స్థితిగతులను మార్చారని అన్నారు. నేటితరం యువత విద్యార్థులు సావిత్రిబాయి పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో వస్తున్న రుక్మతులకు అలాగే విశ్వ సంస్కృతి కి ప్రత్యామ్నాయ సామాజిక విప్లవం సాధించవలసిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కల్యాణ్ కార్యదర్శి జస్వంత్ జిల్లా కమిటీ సభ్యులు అరుణ్ అలాగే రాకేష్ నర్సింగ్ కాలేజ్ విద్యార్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదింటికి వరం

- ఎమ్మెల్యే బాలు నాయక్

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు సంబందించిన 149 మంది బాధితులకు మంజూరైన 52,53,500 రూపాయల విలువ గల సీఎం సహాయనిది చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, వైద్య చికిత్సల కోసం లేదా అత్యవసర సమయంలో ఆర్థిక సహాయం అవసరమైన సందర్భాల్లో సీఎం సహాయనిధి ద్వారా అందిస్తున్న సాయాన్ని వారు విశేషంగా కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వారు వెల్లడించారు. సీఎం సహాయనిధి పథకం కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా సంక్షోభ సమయాల్లో ప్రజలకు ఆశాకిరణంగా ఉంటుందన్నారు. ఈ నిధి ద్వారా అనేక కుటుంబాలకు జీవనోపాధి కోసం మద్దతు లభిస్తోందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణ సహాయం అందించే ఈ విధానం రాష్ట్రంలోనే ప్రత్యేకమైనదని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు తమకు అందించిన సాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వానికి, ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. చివరిగా ప్రజల సంక్షేమం కోసం మరింత సమర్థంగా పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపునిచ్చారు. అనంతరం నేరేడుగొమ్ము మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీపీలు జాని యాదవ్, దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, బిక్కు నాయక్,భవాని పవన్ కుమార్, మాజి జడ్పీటీసీలు బుచ్చి లచ్చీరామ్ నాయక్, బాలు నాయక్,మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి,అంగిరేకల నాగభూషణం, కృష్ణయ్య, మాజీ జడ్పీటిసి సలహాదారుడు యుగంధర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు యునుస్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అడేపు సతీష్ మాదిగ, కొండల్ యాదవ్, భూతం సైదులు,మాస భాస్కర్,మాజి కో ఆప్షన్ సభ్యులు సాదిక్, కౌన్సిలర్ పున్నబోయిన భూదేవి సైదులు, పార్టీ సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి,లాలు నాయక్,యువ నాయకులు బాబు రామ్ నాయక్, రమేష్ నాయక్, మకట్ లాల్, సుభాష్ నాయక్, మాజీ సర్పంచులు, మాజి ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, యువజన నాయకులు, వివిధ అనుబంధ సంఘ నాయకులు, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**జయభేరి, పరకాల, జనవరి 03:**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలే నేటి విద్యార్థులకు ఆదర్శనీయమని, ఆడపిల్లల చదువు కోసం మొట్ట మొదటిసారి పాఠశాలను స్థాపించి వారికి విద్యను అందించిన గొప్ప సంఘసంస్కర్త, అనేక అవమానాలను ఎదుర్కొని, నాటి మూఢచారాలకు వ్యతిరేకంగా మహిళలకు విద్యను అందించడమే ధ్యేయంగా పనిచేయడంలో అగ్రభాగాన నిలిచిన సావిత్రిబాయి పూలే, కృషి వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని, చదువుల తల్లి అంటేనే సావిత్రిబాయి పూలే అని, నాడు సమాజంలో ఉన్న అనేక సాంప్రదాయాలను ఎదిరించి బాలికలకు విద్యను అందించడం కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిబాయి పూలేను నేటి యువత స్మరించుకోవాలని ఆమె ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొచ్చు ఈశ్వర్ పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ మండల నాయకుడు రాకేష్ సోనీ రమ్య మమత రమేష్ సురేష్తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ భీమా చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**జయభేరి, పరకాల, జనవరి 03:**

గీసుగొండ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త దౌడు బాబు ప్రమాదవశాత్తు ఇటీవలే మరణించగా అయన భార్య శారదకి కేసిఆర్ ప్రవేశ పెట్టిన పార్టీ సభ్యత్వం 2 లక్షల రూపాయల భీమా చెక్కును పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా కార్యకర్తలకు భీమా సదుపాయం కల్పించలేదని అన్నారు. మొదటగా బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు భీమా సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్త అకాల మరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే సదుద్దేశంతో కేసీఆర్ భీమా సదుపాయం ప్రవేశ పెట్టారని తెలిపారు. అదేవిధంగా పార్టీ పటిష్టత కోసం కృషిచేస్తున్న ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటానని, వారికి అండగా ఎల్లపుడు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు పోలీస్ ధర్మారావు, చల్లా వేణుగోపాల్ రెడ్డి, పుండ్రు జైపాల్ రెడ్డి, గుర్రం రఘు, బోడకుంట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రెసా కాలమానిని ఆవిష్కరించిన ఆర్డీవో



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ రాజస్వ మండల అధికారి కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్. రమణ రెడ్డి, ట్రెసా డివిజన్ ప్రెసిడెంట్ మహమ్మద్ అయ్యుబ్ ఖాన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

# యువతి పేరుతో చాటింగ్

- పార్ట్ టైం జాబ్ అంటూ యువకుడికి టోకరా
- రూ.1.16 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు



**జయభేరి, తాండూరు:**

పార్ట్ టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ యువకుడికి టోకరా వేశారు. మాయ మాటలు చెప్పి అతని నుంచి నగదును కొట్టేశారు. మోసపోయానని గ్రహించిన సదరు యువకుడు వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు.తాండూర్ డీఎస్పీ బాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు పట్టణానికి చెందిన ఓ యువకుడికి పార్ట్ టైం జాబ్ చేసి డబ్బులు సంపాదించవచ్చని టెలిగ్రాం చానల్ ద్వారా హారతి అనే యువతి పేరుతో మెసేజ్లు వచ్చాయి. టాటా ప్రాజెక్టుకు సంబంధించిన 20 ప్రాపర్టీస్ ను ప్రమోట్ చేస్తే రూ.1000 వస్తుం దని నమ్మబలికింది. ఏకంగా ప్రముఖ కంపెనీ టాటా పేరుతో జాబ్ ఆఫర్ రావడంతో యువకుడు నమ్మాడు. తన వివరాలతో పాటు బ్యాంకు ఖాతా నంబర్ కూడా ఇచ్చాడు. మొదట్లో రూ.1000 చొప్పున యువకుడి ఖాతాలో వేశారు. అయితే పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలంటే కంపెనీకి కొం త నగదు చెల్లించాలని చెప్పారు. దీంతో పలు దఫాలుగా రూ.1.16 లక్షలు వారికి సమర్పించాడు.ఆ తర్వాత అతని ఖాతాలోకి ఒక్కపైసా కూడా జమ కాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. ఈ మేరకు గురువారం స్థానిక డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సైబర్ నేరగాళ్లు అనేక మార్గాల్లో నగదు కొట్టేస్తున్నారని, తెలియని వారి నుంచి ఎలాంటి ఆఫర్లు వచ్చినా, ఓటీపీలు అడిగినా ఇవ్వరాదని అన్నారు. మోసపోయినట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు.




# సంక్రాంతి కలిసొచ్చింది..

'పోలీస్ క్యారెక్టర్‌లో నటించాలన్నది నా డ్రీమ్. ఎప్పటి నుంచో అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి పాత్ర లభించడం ఆనందంగా ఉంది' అని చెప్పింది మీనాక్షి చౌదరి. అనతికాలంలోనే తెలుగు అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా శుక్రవారం మీనాక్షి చౌదరి పాత్రికేయులతో మాట్లాడింది. తాను ఇప్పటివరకు కామెడీ జోనర్ సినిమా చేయలేదని, తొలిసారి ఈ తరహా పాత్రలో నటించడం కొత్త అనుభూతినిచ్చిందని తెలిపింది. ఇందులో తాను యాక్షన్ సీక్వెన్స్ కూడా చేశానని, ఆ ఎపిసోడ్స్‌ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారని చెప్పింది. 'పోలీస్ పాత్ర కోసం ఎలాంటి రిఫరెన్స్ తీసుకోలేదు. మా నాన్న ఆర్మీ ఆఫీసర్ కాబట్టి వారి బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్ మీద అవగాహన ఉంది. నేను కూడా లేడీ పోలీసుల తాలూకు కొన్ని విషయాలను సేకరించాను' అని చెప్పింది. వెంకటేష్ వంటి సీనియర్ నటుడితో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఎప్పుడూ ప్రశాంతగా కనిపిస్తారని, కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుందని మీనాక్షి చౌదరి పేర్కొంది. గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం'తో ప్రేక్షకుల్ని పలకరించానని, ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'లో భాగమయ్యానని, ఈ పండగ తనకు కలిసొచ్చిందని ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం నవీన్ పొలిశెట్టితో ఓ సినిమా చేస్తున్నానని, మరో రెండు చిత్రాలను త్వరలో ప్రకటిస్తానని మీనాక్షి చౌదరి తెలిపింది.





# ఎటెళ్లాలో అర్ధంకాక..?

కథానాయిక రుక్మిణి వసంత్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి శాండిల్‌వుడ్‌లో బాగా హల్‌చల్ చేస్తున్నది. వివరాల్లో కెళ్తే.. ఈ ముద్దుగుమ్మ ఇటీవలే ఎన్టీఆర్‌ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన అగ్రిమెంట్‌లో సంతకం చేసింది. తమ సినిమా పూర్తయ్యేంతవరకు మరో సినిమా చేయకూడదని ఒప్పందం సారాంశం. ఇదిలావుంటే.. దీనికంటే ముందే 'కాంతార2'కు కూడా సైన్ చేసింది. ఈ సినిమా అయ్యేంతవరకూ మరో సినిమా చేయకూడదని రిషబ్‌శెట్టి ఒప్పందం. దానిక్కూడా ఓకే అనేసి, అడ్వాన్స్ అందుకుంది. ఈ రెండు సినిమాలకే కాక, చిన్నాచితకా సినిమాలక్కూడా ఓకే చెప్పిందట. ఈ సినిమాలన్నీ ఈ ఏడాదే షూటింగ్స్ జరుపుకోనున్నాయి. దాంతో తీసుకున్న డబ్బుల్ని వెనక్కి ఇవ్వలేక, ఎటెళ్లాలో అర్థం కాక, బోనులో చిక్కుకున్న ఎలుకలా ఉక్కిరిబిక్కిరి అవుతున్నదట ఈ అందాల భామ. ఓ ప్లానింగ్ లేకుండా అగ్రిమెంట్లపై సంతకాలు చేసినందుకు అటు ప్రశాంత్‌నీల్, ఇటు రిషబ్‌శెట్టి ఈ ముద్దుగుమ్మపై కోపంగా ఉన్నారట. మరి ఈ సమస్యల నుంచి రుక్మిణి ఎలా బయటపడుతుందో చూడాలి. ప్రస్తుతం ఈ వార్త కర్ణాటక సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది.

# నిజామాబాద్‌లో వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం'

టాలీవుడ్ అగ్ర నటుడు విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. యంగ్ డైరెక్టర్ అనిల్ రావుపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ సినిమాలో వెంకటేష్ భార్యగా ఐశ్వర్య రాజేష్ మాజీ గర్ల్ ఫ్రెండ్ గా మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్స్ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు పెంచాయి. అయితే ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్ వేడుకను నిజామాబాద్ జిల్లాలో నిర్వహించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నెల 06న నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను ఉంటుందని మేకర్స్ వెల్లడించారు. గతంలో అనిల్ రావిపూడి, వెంకటేష్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాలు ఘన విజయాలను అందుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబోలో మూడో సినిమా వస్తుడటంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు ప్రేక్షకులు.




Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com